క్లుప్తంగా

## రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు



**అయిజ:** పొగాకు రైతులను జీపీఏ పొగాకు కంపెనీ అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగాకును కాటా వేయకుండా నెలల తరబడి కాలయాపన చేస్తున్నారని, క్వింటా పొగాకు రూ.18,500కు ఒప్పందం చేసుకొని ఇప్పుడు కేవలం రూ.10 వేలకు మాత్రమే కొంటున్నారని విమర్శించారు. చాగాపురం గ్రామంలో 600 బేల్స్ ఇప్పటి వరకు తీసుకోలేదని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయకుంటే రైతుల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి, ఇటిక్యాల మండల అధ్యక్షుడు అబ్దుల్లా పాల్గొన్నారు.

## టెంకాయల వేలం రూ.2.82లక్షలు



**గట్టు:** మండలంలోని మాచర్లలో సోమవారం టెంకాయల వేలం నిర్వహించారు. మాచర్ల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఏడాది కాలానికి వేలం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మాల ప్రకాష్ అత్యధికంగా రూ.2.82 లక్షలకు వేలం దక్కించుకున్నారు.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

**గద్వాల:** బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని, బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. లైంగిక వేధింపుల సమాచారాన్ని 1098 లేదా 100 కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ఏఎస్ఐ సయ్యద్, అబ్బుల్, మోహిన్ తదితరులు ఉన్నారు.

## నేడు కుచినెర్లలో రెవెన్యూ సదస్సులు

**కేటీదొడ్డి:** మండలంలోని కుచినెర్ల గ్రామంలోని మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## లారీని ఢీకొట్టిన కారు

**ఉండవెల్లి:** పట్టణ శివారులోని వీకేర్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఓ కారు ఢీ కొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన మురళీ కృష్ణ భార్య శ్రీవాని, కూతురు సాయి భవానితో కలిసి కారులో మహబూబ్‌నగర్ బయలుదేరారు. ఈ క్రమంలో ఉండవెల్లి శివారులో డ్రైవర్ లారీని నిర్లక్ష్యంగా నడుపుతుండగా కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుకాగా కారులో ఉన్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు డ్రైవర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## స్థానిక సమస్యలపై పోరాటానికి సిద్ధం

**అమరచింత:** పట్టణంలోని ఆయా వార్డుల్లో అభివృద్ధిని గత పాలకులు విస్మరించారని, ఆయా కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో అమరచింత మున్సిపాలిటీ 3వ సీపీఐ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మున్సిపల్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, వచ్చిన నిధులు వినియోగించని కారణంగా నిధులు వెనక్కి వెళ్లాయని, పాలక పక్షం భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చట్లేదని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ అమరచింత పట్టణ కార్యదర్శిగా రవీందర్‌ను ఎన్నుకొన్నారు.

# అడుగడుగునా గుంతలే..



ధరూరు పెట్రోల్ బంకు వద్ద గుంతలమయంగా రాయచూరు రోడ్డు



పారుచర్ల స్టేజీ సమీపంలో..

- గుంతలమయంగా రాయచూరు రోడ్డు
- మరమ్మతుకు నోచుకోని వైనం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

**ధరూరు:** గద్వాల – రాయిచూరు ప్రధాన రహదారిలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు ప్రమాదభరితంగా మారాయి. ధరూరు నుంచి గద్వాల వెళ్లే దారిలో 10 కిలోమీటర్ల మేర దాదాపు 10 చోట్ల బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుగుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ఈ విషయంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్ల నిర్వహణ చేపట్టకపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

**నిత్యం వేలాది వాహనాల రాకపోకలు...**

కర్ణాటక నుంచి ఎక్కువగా ప్రజలు గద్వాలకు వచ్చి తమ వ్యాపారాలు చేసుకుని వెళ్తుంటారు. ముఖ్యంగా జములమ్మ వేడుకలు నిర్వహించడానికి అక్కడి భక్తులు బస్సులు, జీపులు, ప్రత్యేకంగా ఆటోల్లో అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి తమ మొక్కులు సమర్పించుకుని తిరిగి వెళ్తుంటారు. రోజు రోజుకూ ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనాల సంఖ్య పెరుగుతోంది. గతంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణ సమయంలో హైదరాబాద్ నుంచి జడ్చర్ల వయా మహబూబ్‌నగర్, మక్తల్ మీదుగా వెళ్లే బస్సులు, భారీ వాహనాలను ఇటు వైపు నుంచే నడపడంతో రోడ్లు మరింత గుంతలమయంగా మారాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో నీరు నిలిచిన గుంతలను అంచనా వేయలేని ద్విచక్రవాహనదారులు కిందపడి ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం ఉంది.



గోనుపాడు వద్ద గుంతలు

### ఎక్కడెక్కడ అంటే...

ధరూరు ఇండియన్ పెట్రోల్ బంక్, హెచ్‌పీ పెట్రోల్ బంకు, బాపనయ్య పొలం వద్ద, పారుచర్ల స్టేజీ, గోనుపాడు వెళ్లే దారిలో మూడు చోట్ల, సంగాల స్టేజీ సమీపంలో రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. అప్పుడప్పుడు అధికారులు ఆ గుంతల్లో మట్టిని పోసి కాలం వెళ్లదీస్తున్నారు తప్పా ప్యాచ్ వర్క్ పనులు చేపట్టడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అలాగే రాయిచూరు మార్గంలో మలుపు వద్ద కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.

### మరమ్మతు చేయాలి



గద్వాల– రాయిచూరు రహదారి గుంతలయమంగా మారింది. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం రోడ్లు వేశారు. గుంతలతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. గుంతలు పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నర్సన్న, ర్యాలంపాడు

### ప్రమాదం బారిన పడకముందే..



ప్యాచ్ వర్కులు త్వరగా పూర్తి చేయాలి. గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. ఇప్పటికే చాలా మంది కిందపడి గాయాలపాలయ్యారు. పెద్ద ప్రమాదం చోటు చేసుకోక ముందే అధికారులు మేల్కోవాల్సిన అవసరం ఉంది.

– విజయాచార్యులు, ధరూరు

### మరమ్మతు చేయిస్తాం

నందిన్నె నుంచి ధరూరు వరకు ప్యాచ్ వర్కు పూర్తయ్యింది. ధరూరు నుంచి చేయాల్సి ఉంది. త్వరలోనే నిధులు వచ్చే వకాశం ఉంది. నిధులు మంజూరయన వెంటనే పూర్తి చేయించి, వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తాం.

– రామక్రిష్ణ, ఆర్అండ్‌బీ ఏఈ

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



యాపదిన్నెలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు



అలంపూర్‌లోని ఉట్కూరు సదస్సుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మంజుల

**అయిజ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సును సోమవారం మండలంలోని యాపదిన్నెలో నిర్వహించారు. డిప్యూటి తహసీల్దార్ ప్రశాంత్ గౌడ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ఐ భరత్ కుమార్, మండల సర్వేయర్ అనసూయ, జూనియర్ అసిస్టెంట్‌లు గోవిందు, జ్యోతి, బజారన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారామే ధ్యేయం**

**అలంపూర్ :** గ్రామాల్లోని రైతులు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మంజుల అన్నారు. అలంపూర్ మండల పరిధిలోని ఉట్కూరు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో గ్రామానికి చెందిన పలువురు రైతులు భూ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు సమర్పించారు. మొత్తం 31 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ సహాయకులు సుచిత్ర, ఆంజనేయులు, ఆర్ఐలు దుర్గా సింగ్, మాసుం బాష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**భూ భారతిలో 13 దరఖాస్తులు**

**శాంతినగర్:** వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో సోమవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 13 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటి తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతిలో వివిధ భూ సమస్యల గురించి దరఖాస్తులు వస్తున్నట్లు డీటీ వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రప్ప, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**38 దరఖాస్తుల స్వీకరణ**

**ఎర్రవల్లి:** రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి 38 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శశేర్, శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కేటీదొడ్డి:** మండలంలోని గంగన్‌పల్లిలోని నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ హరికృష్ణ తెలిపారుచారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**గట్టు:** మండలంలోని ఆలూరులో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతులు 180 దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ధరూరు:** మండలంలోని మార్లబీడు, గార్లపాడులో జరిగిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ హాజరై దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 23 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు తిరుమలేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీని తొలగించాలి

**ఉండవెల్లి:** సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సీఐటీయూ నాయకులు ఖండించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. సోమవారం పెద్ద ధన్వాడా రైతులను పరామర్శించడానికి వచ్చిన జాన్‌వెస్లీని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయ డం దారుణమన్నా రు. ఇథనాల్ ఫ్యాక్టరీని అక్క డి నుంచి తొలగించేంత వరకు సీపీఎం పార్టీ రైతా ంగానికి అండగా ని ల వాలని కామ్రేడ్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. న రసింహ, శేఖర్, అశో క్, వెంకటేష్, లక్ష్మన్న, మధు, రాముడు, సురేష్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

**మానవపాడు:** గ్రామ పంచాయతీలకు సంబంధించి ట్రెజరరీలో ఉన్న పెండిగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలని మానవపాడు పంచాయతీ కార్యదర్శులు నారేందర్‌రెడ్డి, నాగరాజు, జయమ్మ, మంజుల, సంధ్యరాణి, మేరీ, అరుణ, శివశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీల నిర్వహణలో ట్రాక్టర్ డీజిల్ ఖర్చులు, తాగు నీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ ఇతర పారిశుద్ధ్య నిర్వహణ నిధులు విడుదల చేయాలని నిజామాబాద్, కరీంనగర్, ఇతర జిల్లాలో ఆన్‌లైన్ హాజరు విషయమై జిల్లా పంచాయతీ అధికారులు పంచాయతీ కార్యదర్శులపై చేసినటువంటి షోకాజ్ మెమో, సీఎల్ మెమోలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఖమ్మం జిల్లాకు చెందిన పంచాయతీ సెక్రటరీ బానోత్ సోనాలి బైక్‌పై కార్యాలయానికి వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందగా సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల:** తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నాలుగు సంవత్సరాల విధినిర్వహణ కాలాన్ని సర్వీస్‌గా డిక్లేర్ చేయాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీల నిర్వహణలో భాగంగా ట్రాక్టర్ ఖర్చులు, తాగునీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య ఖర్చులకు నిధులు విడుదల చేయాలన్నారు. అనంతరం ఖమ్మం జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పంచాయతీ కార్యదర్శి బాణోత్ సోనాలి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు.



కార్యదర్శి మృతికి సంతాపం తెలుపుతున్న ఎంపీడీఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**అలంపూర్ :** అలంపూర్ మండలం లింగనవాయి గ్రామానికి చెందిన పుట్టపోగుల చిన్న నాగన్న అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి వెళ్లి చిన్న నాగన్న భౌతికకాయానికి పూమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

**గద్వాల:** ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోని సోమవారం రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజుల నియంత్రణ చట్టాన్ని పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సీపీఐ జిల్లా నాయకులు ఆంజనేయులు, కుర్వ పల్లయ్య, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

**పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

ఐజ మండలంలో అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కుర్వ పల్లయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఈ మేరకు కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక వసతులు లేని పాఠశాలలు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడులు

**శాంతినగర్ :** ప్రతి సీజన్‌లో పంట మార్పిడి చేస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం శాస్త్రవేత్త డా.కె. శ్రీధర్ అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో ప్రాతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం వారి ఆధ్వర్యంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీధర్ రైతులకు వర్షాధార వ్యవసాయంలో నీటిని సంరక్షించే చర్యలు, పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు, చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. అంతే గాకుండా రైతులు తాము కొన్న విత్తనాలు, పురుగు మందులు, తెగుళ్ల మందులకు సంబంధించిన రసీదులు భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు విమల, చంద్రకళ, వినోద్, రవీందర్‌రెడ్డి, రామానాయుడు, రైతులు పాల్గొన్నారు.



పంటలసాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీధర్

## బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

**మల్దకల్ :** చదువు మధ్యలోనే ఆపేసిన పిల్లలందరినీ బడుల్లో చేర్పించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మల్దకల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు బడికి, పెద్దలు పనికి అనే నినాదంతో ఉపాధ్యాయులు చదువు ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించి పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన

**మానవపాడు:** మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత నిబంధనలపై సోమవారం మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ కేశవరావు, కళాజాత బృందం ఆధ్వర్యంలో రాధమ్మ, రామాంజనేయులు, కృష్ణ ప్రజలకు అవగాహన కల్పించారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే తమ విలువైన భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. చెడు అలవాట్లు, దుష్పలితాల గురించి కళాజాత బృందం ఆధ్వర్యంలో పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్‌లు, కళాజాత బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




పెద్దఆముదాలపాడులో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

## త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ




**గట్టు:** మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డిలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రబోధ సేవా సమితి వారు పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక బింగిదొడ్డి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం తెలియజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, సభ్యులు రంగప్ప, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నర్సింహ, శివ, జయమ్మ, పద్మమ్మ, జములమ్మ, అనంతమ్మ, సభద్రమ్మ, దీపిక, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగిన తిరంగా యాత్ర



**అమరచింత:** జవాన్లకు మద్దతుగా 'మేము సైతం మీ వెంటే' అనే నినాదంతో సోమవారం మండల కేంద్రంలో ప్రజలు తిరంగయాత్ర చేపట్టారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పౌరులు బలి తీసుకున్న మతోన్మాద ఉగ్రవాదుల దాడికి ప్రతి దాడిగా భారత ప్రభుత్వం తీసుకున్న ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో త్రివిధ దళాధికారులకు, రక్షణ దళాలకు మద్దతుగా తిరంగయాత్ర చేపట్టినట్లు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, మంత్రి సుధీర్, మేర్వరాజు, మరాఠి అశోక్, మంగ అంజి, వినోద్, రాకేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.